
ఫార్మ్ ఛీలు

● అర్హత లేకున్నా మెడికల్ దుకాణాల నిర్వహణ

● అద్దె సర్టిఫికెట్లతో దందా.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

వార్త 6లో



ప్రమాదం జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ముందు భాగం



ఘటనపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



టన్నెల్ వద్దకు చేరుకున్న రెస్క్యూ బృందం

టెన్షన్.. టెన్షన్..

- దోమలపెంట వద్ద కూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్
- బయటికి పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్న 46 మంది
- టన్నెల్‌లో ఇరుక్కుపోయిన మరో 8 మంది
- వారిని కాపాడేందుకు రంగంలోకి ఆర్మీ
- ఘటనా స్థలానికి మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్/అచ్చంపేట/దోమలపెంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ(శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ) సొరంగంలో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంతో నల్లమల ఉలిక్కిపడింది. దాదాపు 10 సంవత్సరాలుగా టన్నెల్ నిర్మాణ పనుల్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఇంజనీర్లు, 6 మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకున్న సంఘటనను తోటి కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉదయం షిఫ్టులో పని చేయడానికి ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు టన్నెల్ బోర్ట్ మిషన్ ఆపరేటర్లు, 54 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. 14వ కిలోమీటరు వద్ద టన్నెల్ బోరు మిషన్‌తో తవ్వకం పనులు చేపడుతుండగా సరిగ్గా 8:30 గంటల సమయంలో ఆకస్మికంగా టన్నెల్‌లో నీరు వచ్చింది. మట్టిదిబ్బలు, రాళ్లు, కూలి పడ్డాయి. అరగంట వ్యవధిలో 8 మీటర్ల వరకు నీళ్లు చేరడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. 124 మీటర్ల దూరం వరకు టన్నెల్‌లో పెచ్చులూడిపడ్డాయి. దాంతో టన్నెల్ బోర్ట్ మిషన్ వెనుకభాగంలో ఉన్న 46 మంది బయటకు పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. టన్నెల్ బోర్ట్ మిషన్ (టీబీఎం) ముందు భాగంలో ఉన్న 8 మంది టన్నెల్‌లోనే కూరుకుపోయారు. అంతా క్షణాల్లోనే జరిగిపోవడంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో మాట్లాడారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెలిక్యాప్టర్‌లో దోమలపెంటకు చేరుకొని, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో తక్షణ సహాయక చర్యల గురించి సమీక్ష నిర్వహించారు.

బయటపడేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఉందా?

దాదాపు 4 సంవత్సరాలుగా టన్నెల్ నిర్మాణ పనులు ఆగిపోగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అనుమతి తర్వాత 4 రోజుల క్రితం తిరిగి పనులు ప్రారంభించినట్లు సంబంధిత కాంట్రాక్టు సిబ్బంది చెబుతున్నారు. లోతుగా పరిశీలన తర్వాత మాత్రమే టన్నెల్ నిర్మాణ పనులకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. అయితే సొరంగం పనులు ప్రారంభించిన 4 రోజులలోనే నీళ్లు చేరడం మట్టి, రాళ్లు కూలిపడిన సంఘటన చోటుచేసుకోవడం ఘటన అంతుబట్టడం లేదు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు సురక్షితంగా బయటపడేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఉందా? లేదా? అనే అంశంపై నిర్మాణ సంస్థ ఇంజనీర్లు స్పష్టత ఇవ్వడంలేదు. దాదాపు 4,600 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన సొరంగ పనుల్లో దాదాపు 1,200 మంది కార్మికులు, టెక్నికల్ సిబ్బంది, విధులు నిర్వహిస్తున్నారు. శనివారం చోటుచేసుకున్న ఘటనలో నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం ఏమైనా ఉందా. అనే కోణంలో కూడా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే లోపల చిక్కుకున్న 8 మందిని కాపాడడానికే అధికార యంత్రాంగమంతా దృష్టి సారించింది.

దోమలపెంటకు చేరుకున్న ఆర్మీ

ఎస్ఎల్‌బీసీ ఘటన నేపథ్యంలో సహాయక చర్యలో పాల్గొనేందుకు ఆర్మీ జవాన్లు రంగంలోకి దిగారు. సాయంత్రం 6 గంటలకు దోమలపెంటకు చెరుకున్న జవాన్లు రెస్క్యూ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎస్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభంకానున్నాయి. లోపలికి వెళ్లాలంటే డీవాటరింగ్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. దీనికి సంబంధించి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తేనే సాధ్యమవుతోంది. అదేవిధంగా కులిపోయిన మట్టి రాళ్ల కుప్పలను ఎత్తిపోయడానికి ఎంత సమయం పడుతుందో అంచనా వేసే పరిస్థితిలో అధికారులు లేరు. అయితే టన్నెల్ తవ్వకంలో కార్మికుల కోసం తీసుకున్న రక్షణచర్యలకు మాత్రం గోప్యతను ప్రదర్శిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది.



జాగిలంతో టన్నెల్ వద్దకు చేరుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

సహాయక చర్యలను ముమ్మరం చేస్తాం: ఎంపీ మల్లు రవి

ఎస్ఎల్‌బీసీ దుర్ఘటన విషయంలో బాధితులను కాపాడేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి చెప్పారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఆయన శనివారం రాత్రి దోమలపెంటకు చేరుకొని, బాధిత కుటుంబాలను పరామర్శించారు. అధికారులనడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసరంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మీ సహాయం కోరడంతో పాటు ప్రత్యేక రక్షణ బృందాలను పంపించారని తెలిపారు. సింగరేణి నుంచి కూడా రెస్క్యూటీం చెరుకున్నందని ఆయన స్పష్టం చేశారు.

జియోలాజికల్ సర్వే నివేదికను బయట పెట్టాలి: మాజీ మంత్రి నాగం

ఎస్ఎల్‌బీసీలో జరిగిన దుర్ఘటన బాధాకరమని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. టన్నెల్లో చిక్కుకున్న వారంతా క్షేమంగా బయటకు రావాలని కోరుకుంటున్నానని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదానికి ముమ్మాటికీ నిర్లక్ష్యమే కారణమని ఆయన దుయ్యబట్టారు. సొరంగంలో నీళ్లు ఎలా వచ్చాయో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టన్నెల్‌కు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదికను బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు.

వనపర్తి అభివృద్ధికి పూర్తి సహకారం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి తదితరులు

పెద్దమందడి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని, ఎమ్మెల్యే మేఘారెడ్డి అహర్నిశలు అభివృద్ధి కోసం కృషి చేస్తూనే ఉంటారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం వెల్టూరు గ్రామ చేనేత కాలనీలోని ఉన్ని పారిశ్రామిక సంఘం కార్మికులతో మాట్లాడారు. ఇక్కడ కార్మికులు తయారు చేసిన రగ్గులు ఫినిషింగ్ కోసం హర్యానా తీసుకెవెళ్లాల్సి వస్తోందని, ఆ ఫినిషింగ్ యూనిట్‌ను తమకు మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం జాతీయ రహదారి బుర్రవాగు స్టేజీ నుంచి మోజర్ల గ్రామానికి వెళ్లే రహదారి పరిధిలో రూ.8.38 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెనల నిర్మాణానికి, ఉద్యాన కళాశాల ఆవరణలో నిర్మించే 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఉపాధ్యాయులు విద్యార్థిగా ఉండాలి

- స్టూడెంట్స్ స్థాయిని బట్టి బోధన చేయాలి: కలెక్టర్ సిక్తా పట్నాయక్
- నారాయణపేటలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఆకస్మిక తనిఖీ

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమావేశాల నిర్వహణను గమనించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అకాడమిక్ లీడర్షిప్ తీసుకోవాలని, విద్యార్థుల స్థాయిని బట్టి వారికి అర్థమయ్యేలా బోధన చేయాలని చెప్పారు. అందుకోసం ఉపాధ్యాయులను సంసిద్ధం చేయాలన్నారు. పాఠశాల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను డ్యాష్ బోర్డు ఆధారంగా సమీక్షించి, మెరుగైన బోధన పద్ధతులను అమలు చేయాలన్నారు. వెనుకపడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పబ్లిక్ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఈవో గోవిందరాజులును ఆదేశించారు. సమీక్షలో ఏఎంవో విద్యాసాగర్, ఎంఈవో బాలాజీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



శుక్రవారం అప్పక్‌పల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

సీఎం సభ సక్సెస్‌తో.. నూతనోత్తేజం

- ఊహించిన దానికంటే ఎక్కువగా వచ్చిన మహిళలు
- కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేట పర్యటన విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో పాటు మహిళలు ఊహించని విధంగా అధిక సంఖ్యలో తరలొచ్చారు. రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సీఎం చేశారు. అభివృద్ధికి ఇది తొలిమెట్టు అని, రాబోయే రోజుల్లో నారాయణపేట నియోజకవర్గ రూపురేఖలు మర్చుతామని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ కురువృదుడు దివంగత చిట్టెం నర్సిరెడ్డి పేరు మెడికల్ కళాశాలకు పేట్టాలని సీఎం సూచించడంతో చిట్టెం అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగి, ఈ ప్రాంత అభివృద్ధి కోసం.. అభివృద్ధి పనుల్లోనే అసువులు బాసిన నర్సిరెడ్డి చిరకాల వాంఛ అయిన పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడంతో ఈ ప్రాంత వాసుల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఈ పథకాన్ని త్వరిత గతిన చేసి, లక్షా 25 వేల ఎకరాలను కృష్ణా నీటితో సస్యశ్యామలం చేయాలని సీఎం సీఎం అడుగులు వేస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పథకం సర్వే పనులను రైతులు అక్కడక్కడ అడ్డుకున్నారు. దాంతో సాగు నీటితోనే నారాయణపేట-కొడంగల్ నియోజకవర్గాలు శాశ్వతంగా అభివృద్ధి చెందుతాయన్న విషయాన్ని గుర్తించుకోవాలని, భూసేకరణకు సహకరించాలని సీఎం కోరారు. ఈ ప్రాంత బిడ్డగా తనపై నమ్మకం ఉంచాలని, పరిహారం ఎకరాకు రూ.పది లక్షలు కాకపోతే రూ.20 లక్షలు ఇస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమలు సాధించుకోవాలన్నారు. సభను విజయవంతం చేసిన ప్రజలు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త మండలాల మాట ఎత్తని సీఎం

నియోజకవర్గంలోని మూడు కొత్త మండలాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఎత్తక పోవడంతో ఆయా ప్రాంతవాసులను నిరాశ పరిచింది. గత ఎన్నికల ముందు కోయిల్‌కొండ మండలం గార్లపాడ్, దామరగిద్ద మండలం కాన్‌కుర్తి, నారాయణపేట మండలం కోటకొండలను మండలాలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మండలాల ఏర్పాటు కోసం ఆయా గ్రామస్థులు ఆందోళనలు, ఉద్యమాలు కూడా చేశారు. గత నెలలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో నారాయణపేట అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన మూడు రోజుల ధర్నా శిబిరాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి సందర్శించి, కోటకొండను మండలంగా ప్రకటింపజేయాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. సీఎం నోటితో మండలాన్ని ప్రకటింపజేస్తామని హామీ ఇచ్చి, ధర్నాను విరమింపజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, కొత్త మండలాలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి గంప జాతర

● నెత్తిన గంపలతో కోయిలకొండ నుంచి కాలినడకన వచ్చిన భక్తులు 7



గంపలతో వస్తున్న భక్తులు



దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి రిమాండ్

● కర్ణాటక రాష్ట్రం సిలర్‌కోటే గ్రామానికి చెందిన బైరంకొండ శ్రీనుగా గుర్తింపు

● వివరాలు వెల్లడించిన సీఐ శివశంకర్ 7

చర్యలకు రంగం సిద్ధం

● రాజాపూర్ కేజీబీవీలో జరిగిన ఘటనపై మరోసారి విచారణ

● ముగ్గురు అధికారులతో కమిటీ 7



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గుండంలో స్నానం చేస్తున్న భక్తులు

మన్యంకొండలో రద్దీ

- జాతరకు తరలొచ్చిన భక్తులు
- స్వామి వారికి శేషవాహన సేవ

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బహ్మోత్సవాల్లో భాగంగా జాతరకు భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలొచ్చారు. స్వామికి ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకులు అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. శేషవాహన సేవ నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని, దాసంగాలతో నైవేద్యం పెట్టారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి కృపాకటాక్షం ఉండాలి: మనందరికి స్వామివారి కృపా కటాక్షం ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మన్యంకొండ వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే.. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డితో కలిసి శనివారం దర్శించుకున్నారు. ధర్మకర్త మధుసూదన్ కుమార్ ఎమ్మెల్యే పేరుపై అర్చన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మన్యంకొండను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిత, సిరాజ్ ఖాద్రి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

విద్యానిధికి రూ.5 లక్షలు



విద్యానిధికి రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న పంచవటి విద్యాలయం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ విద్యానిధికి పట్టణానికి చెందిన పంచవటి విద్యాలయం తరఫున రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్ విజయేందిర బోయికి శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచవటి విద్యాలయ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రతీ ఒక్కరు విద్యానిధికి సహకరించాలని పిలుపునిచ్చారు. పంచవటి విద్యాలయం నుంచి ప్రతియేటా రూ.5 లక్షల విరాళం అందిస్తామని చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ముడా చైర్మన్ లక్ష్మన్ యాదవ్, సిరాజ్ ఖాద్రి, సీజే బెనహర్, నాగారాజు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి గ్రామ శివారులో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా పంప్‌హౌస్ నిర్మాణానికి భూములను సర్వే చేయడానికి వచ్చిన అధికారులను రైతులు శనివారం అడ్డుకున్నారు. తాము ఇప్పటికే వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని.. భూములు కోల్పోతే ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. తమ భూములకు పరిహారం ఎంత అందజేస్తారో తేల్చి చెప్పాలని, లేకపోతే వెంటనే సర్వేను ఆపాలని వారు అధికారులను అడ్డుకున్నారు. ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించినా వారు వినలేదు. చివరకు అధికారులు సోమవారం వరకు రైతులకు సమయం ఇచ్చారు. ఆ రోజు లోపు మీరు ఎవరితో మాట్లాడుతారో తేల్చుకోవాలని, సోమవారం తమ పని తాము చేసుకుపోతామని చెప్పి వారు వెళ్లిపోయారు.

అధికారులు మారినా.. మార్చని పేర్లు



బోర్డుపై ఉన్న పాత కలెక్టర్, డీఈవో పేర్లు

ధన్వాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా ధన్వాడ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బోర్డులో అధికారుల పేర్లను మార్చలేదు. అధికారులు మారినా బోర్డుపై వారి పేర్లను మార్చలేదు. పాఠశాలలో కలెక్టర్ హరిచందన, డీఈవో రవీందర్ పేర్లతోనే ఉన్న బోర్డును పెట్టారు. కలెక్టర్ హరిచందన తర్వాత కోయ హర్ష పనిచేశారు. ఆ తర్వాత ఆయన బదిలీపై వెళ్లగా ప్రస్తుతం సిక్తా పట్నాయక్ జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. డీఈవో సైతం ఇద్దరు మారారు. ఇక ఎంఈవోగా ప్రస్తుతం ఇదే పాఠశాలలో పనిచేస్తున్న గాయత్రి ఉన్నారు. కానీ బోర్డుపై ఎంఈవోగా అంజలీదేవి పేరు ఉంది. కాంప్లెక్స్ హెచ్ఎం ప్రస్తుతం నర్సింహ్మాచారి ఉన్నారు. కానీ బోర్డుపై రమేష్‌శెట్టి పేరుంది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ఇలా పాత అధికారుల పేర్లే చదువుకోవాలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఫార్మ'ఛీ'లు

● మహబూబ్‌నగర్ జిల్లాలో అర్హత లేకున్నా మెడికల్ దుకాణాల నిర్వహణ
● అద్దె సర్టిఫికెట్లతో దందా
● డాక్టర్ చీటీ లేకుండానే మందులు
● పర్యవేక్షణ మరిచిన అధికారులు



ఓ మెడికల్ షాపులో మందులు ఇస్తున్న యువకుడు

మహబూబ్‌నగర్(వైద్య విభాగం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో మెడికల్ దుకాణాల దందా కొనసాగుతోంది. అర్హత లేకున్నా.. ఫార్మసీ సర్టిఫికెట్లను అద్దెకు కొనుగోలు చేసి, షాపులను నడుపుతున్నారు. వందలాది మెడికల్ దుకాణాలు బినామీ పేర్లతో నిర్వహిస్తున్నారు. రోగులకు డాక్టరు ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వొద్దు. కానీ పలు షాపుల్లో ఎలాంటి చీటీలు లేకుండా మందులు ఇస్తున్నారు. తద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు బాధ్యత మరిచి, ముడుపులకు అలవాటు పడ్డారనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

అర్హత లేకున్నా ఫార్మసీల నిర్వహణ

జిల్లాలో 400లకు పైగా రిటైల్, 200లకు పైగా హోల్‌సేల్ మెడికల్ దుకాణాలు ఉన్నాయి. అందులో అర్హత లేకున్నా ఫార్మసీలు నిర్వహిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. వాస్తవానికి మెడికల్ షాపు నిర్వహించాలంటే బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసి డీ-ఫార్మసి విద్యార్హత అవసరం. అలాంటి సర్టిఫికెట్లు లేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నారు. బినామీ పేర్లతో అనుమతి తీసుకుని షాపులు నడుపుతున్నారు. అనధికారిక లెక్కల ప్రకారం అర్హత లేని ఫార్మసీలు దాదాపు 150 వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

అద్దె సర్టిఫికెట్ల దందా

జిల్లాలో ఫార్మసీ అద్దె సర్టిఫికెట్ల దందా నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న మెడికల్ షాపుల్లో దాదాపు 50 శాతం అద్దె సర్టిఫికెట్లతో కొనసాగుతున్నాయి. ఫార్మసీ పట్టా పొందినా ఉద్యోగాలు రాకపోవడంతో వారి పట్టా సర్టిఫికెట్‌లను అద్దెకు ఇస్తున్నారు. మెడికల్ షాపుల యాజమాన్యాలు ఒక్కో సర్టిఫికెట్‌కు ఏడాదికి దాదాపు రూ. 25 వేల నుంచి రూ.30 వేల వరకు అద్దెకు తీసుకుంటున్నారు. చాలా మంది సర్టిఫికెట్లను అద్దెకు ఇచ్చి, పోలెపల్లి సెజ్ వంటి ఫార్మ కంపెనీలలో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మరికొంతమంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు కూడా చేసుకుంటున్నారు.

కనిపించని ఫార్మసిస్టులు

ప్రస్తుతం ఉన్న మెడికల్ దుకాణాల్లో 60 శాతం వరకు ఫార్మసిస్టులు ఉండటం లేదు. వాస్తవానికి మెడికల్ దుకాణాల్లో మందులు ఇచ్చే వర్కర్లు కూడా ఫార్మసి చేసి ఉండాలి. కానీ ఫార్మసీ చేయకుండానే.. 10వ తరగతి, ఇంటర్ చదివి, కొద్దోగొప్పో ట్యాబ్లెట్ల గురించి జ్ఞానం ఉన్న వారు ఫార్మసిస్టులుగా చెలామణి అవుతున్నారు. వీరితో పాటు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ కూడా ఫార్మసిస్టులుగా కొనసాగుతున్నారు. వారే మెడికల్ దుకాణాల్లో మందులు ఇస్తున్నారు. అయితే వారికి ఇచ్చే జీతం కూడా నెలకు రూ. 6 వేల నుంచి రూ.10 వేల లోపే ఉంటున్నాయి.

నిబంధనలు పాటించని నిర్వాహకులు

జిల్లాలోని మెడికల్ దుకాణాలు ఒక్కటి కూడా నిబంధనలు పాటించడం లేదు. డాక్టర్ల చీటీ లేకుండా మందులు ఇవ్వొద్దనే నిబంధన ఉంది. కానీ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా దుకాణాల్లో మందులు ఇస్తున్నారు. అంతేకాకుండా కొన్ని మత్తు, నిద్రకు సంబంధించిన మందులు కూడా చీటీ లేకుండానే ఇస్తున్నారు. ఏ ఒక్క ఫార్మసిస్టు ఆప్రాన్ ధరించడం లేదు. సరైన ఉష్ణోగ్రతలో మందులు నిల్వచేయడం లేదు. గ్రామాల్లో సైతం అర్హతలేకున్నా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పూర్తిగా మామూళ్ల మత్తులో కూరుకుపోయారనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఎప్పుడు చూసినా కార్యాలయం ఖాళీగానే కనిపిస్తుంది. ఎక్కడికెళ్లారు అని అడిగితే తనిఖీలకు వెళ్లారని చెబుతారు. కానీ తనిఖీలు చేసిన దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. అయితే తనిఖీలకు మాత్రం ఆ శాఖ ఉన్నతాధికారి ఒక్కరే వెళతారు. అవి లేవు... ఇవి లేవు అని చెప్పి వారికి నోటీసులు ఇస్తున్నారు. తిరిగి వారం రోజుల్లో ఆ లోపాలు సరిదిద్దుకోలేకపోయినా మళ్లీ అనుమతులు ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన ఆస్పత్రికి తనిఖీలకు వెళ్లిన అధికారులు వారి నుంచి భారీగానే నజరానా తీసుకున్నట్లు సమాచారం. ప్రతీ నెల ఒక్కో షాపు నుంచి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు మామూళ్లు ఇస్తున్నారని సమాచారం. ఇందుకోసం ఒక కెమిస్టు, డ్రగ్గిస్టు యూనియన్ సభ్యున్ని నియమించారని తెలిసింది.

తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నాం

జిల్లాలోని మెడికల్ దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రతీ మెడికల్ షాపు రూల్ 65 నిబంధనలు పాటించాలి. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది 75 మందికి నోటీసులు ఇచ్చాం. మెడికల్ దుకాణాల్లో ఫార్మసిస్టులు కచ్చితంగా ఉండేలా చూస్తున్నాం. బినామీ పేర్లతో ఎవరైనా ఉంటే వారి లైసెన్సులు రద్దు చేస్తున్నాం. మా కార్యాలయంలో సిబ్బంది కొరత వలన తనిఖీలు తక్కువగా అవుతున్నాయే తప్ప.. ఎక్కడా అవినీతికి పాల్పడటం లేదు.

- రబియా, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి

గ్రామ గాంభీర్యానికి చిహ్నం ఊర వాకిలి

ఆదివారం ప్రత్యేకం



మానసాడు మండలం బొంకూర్‌లోని ఊరవాకిలి

● గ్రామైక్యతకు, జీవన శైలికి నిదర్శనం

అయిజ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలంలో ప్రతీ గ్రామానికి ఊర వాకిలి ఉండేది. ఇదే గ్రామానికి ప్రధాన ద్వారం. ఆ గ్రామంలోకి వెళ్లాలంటే మొదట్లో ఊర వాకిలి దాటుకుని ప్రవేశించాల్సి ఉంటుంది. ఆ గ్రామంలో దేనికి ప్రాముఖ్యత ఇస్తారనేది తెలియచేస్తూ వివిధ ఆకృతులలో నిర్మాణాలు సాగేవి. నాటి ప్రాచీన, రాచరిక కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు చరిత్రకు సాక్ష్యాధారాలుగా నిలిచే గుర్తులు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఊరవాకిలికి ప్రాధాన్యం ఉంది. జిల్లాలోని అయిజ, రాజోలి, మానవపాడు మండలాల్లో అధికంగా ఉన్నాయి. ఇవి చెదిరిపోయిన ఆనాటి స్మృతులను మాత్రం ప్రజలు మరచిపోరు ముందు తరాల వారికి తెలియచేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అవి శిథిలావస్థకు చేరినా పునః నిర్మాణం చేస్తూనే ఉన్నారు. గ్రామం మొత్తం ఒక ప్రహరీ (ఊర వాకిలి)లోనే ఉండేది. ఆపద వేళలో ఊరవాకిళ్లను మూసివేసి తమ గ్రామ ప్రజలు కాపాడుకునే వారు.

నేలకు ఆరడుగుల ఎత్తులో అరుగులు..

ఊర వాకిలి గ్రామం యొక్క ప్రధాన ద్వారం. గ్రామ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళ ఇక్కడ కూర్చుని ముచ్చట్లు చెప్పుకునేందుకు ఇరు వైపుల నేలకు ఆరడుగుల ఎత్తులో అరుగులు ఉండేవి. గ్రామానికి ఎవరైన అతిథులు వస్తే తమకు కావాల్సిన వారు అందుబాటులో లేకపోయినా ఇక్కడ సేద తీరేందుకు అనువుగా నిర్మాణాలు చేపట్టేవారు. మట్టితోను, రాళ్లతోను వీటి నిర్మాణం సాగేది. ఇవి కాల క్రమేణ అంతరించిపోతున్నాయి. ఇప్పటికీ కొన్ని గ్రామాలలో ఊరి వాకిలి సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. లక్షలు ఖర్చు చేసి పునః నిర్మాణాలు చేస్తూనే ఉన్నారు. చాలా వరకు పల్లెల్లో ఊరవాకిలి మధ్యలో నేలపై బొడ్రాయిని ఏర్పాటు చేసేవారు. కొన్ని గ్రామాలలో ఊరి బయట కట్టకట్టి కూడా ఉంచుతారు. గ్రామంలో ఎవరైన చనిపోయిన మృతదేహాన్ని ఊర వాకిలిలోని బొడ్రాయి మార్గం మీదుగా ఊరు దాటించి అంత్యక్రియలకు తీసుకెళ్లేవారు. వివివాహాల సందర్భాలలో పెళ్లికూతురు ఊరిదాటి వెళ్లాలన్నా.. గ్రామంలోకి రావాలన్నా.. ఊరవాకిలి దగ్గర ఉన్న బొడ్రాయికి పూజ చేసేవారు. ఇంటికి వచ్చిన బంధువులను కూడా ఊర వాకిలి దాకా సాగనంపేవారు. గ్రామాలు విస్తరించటం వలన కొద్దిగా మార్పులు కనిపిస్తున్నాయి. పూర్వం మోకాలు ఎత్తులో బొడ్రాయి ఉండేది. కాల క్రమేణ రహదారుల అభివృద్ధి కారణంగా చిన్న రాళ్లుగానే మిగిలిపోతున్నాయి. ఊర వాకిలి సైతం కనుమరుగు అవుతున్నప్పటికి అక్కడక్కడా పునః నిర్మాణం చేస్తున్నారు.



నేతాజీ సుభాస్ చంద్రబోసు విగ్రహంతో ఉత్తనూర్ ఊరవాకిలి

గ్రామ సంస్కృతిని కాపాడేందుకు పునఃనిర్మాణం

గ్రామ సంస్కృతిని కాపాడి ముందు తరాల వారికి అందించాలనే ఊర వాకిలిని పునఃనిర్మించారు. 2005 సంవత్సరంలో రూ. 2 లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేశాం. గ్రామం మొత్తానికి కలిపి ఊర వాకిలి ఉంటే గ్రామైఖ్యతకు నిదర్శనంగా భావించి చేశాను. వ్యవసాయానికి ప్రతీకగా రెండు ఎద్దులు ఏర్పాటు చేశాం. గ్రామంలోకి వచ్చే వారికి గ్రామ గాంభీర్యం తెలియచేస్తుంది. అది చూస్తే గొప్ప అనుభూతి కలుగుతుంది.

- లక్ష్మీకాంతరావు, మేడికొండ మాజీ సర్పంచు

అదే మా అడ్డా

ఊర వాకిలి మా అడ్డా.. అక్కడికి చేరి అందరం అల్లరి చేసే వాళ్లం. ఉదయం, సాయంత్రం అక్కడే ఎక్కుక సమయం గడిపే వాళ్లం. అక్కడికి చేరితే అదో ఉల్లాసం. ఆటలాడుకోవాలన్న, అల్లరి చేయాలన్న అదే మాకు అడ్డా. ఊర వాకిలే మా లోకం. పొద్దున ఎన్ని పనులు చేసిన అక్కడికి చేరే సరికి అలసట మర్చిపోయేవాళ్లము.

- సత్యనారాయణ రెడ్డి, యాపదిన్నె

మా ప్రాణమంతా అక్కడే ఉండేది

మా పాణమంతా ఊర వాకిలి వద్దనే ఉండేది. ఎప్పుడు పొద్దు మూకుతుందా, ఇంటికి చేరి తిని ఊర వాకిలి దగ్గరకు చేరుదామ అని ఉండేది. మా దొస్తులతో కలిసి ఊరవాకిలి వద్ద చాలా సంతోషంగా గడిపాము. ఇప్పుడు తలచుకుంటేనే ఆ చిన్నతనం మళ్లీ వస్తే బాగుంటుందనిపిస్తుంది.

- నాగేశ్వర్‌రావు, రాజోలి

వట్టెం వెంకన్న ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు



వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి శరత్‌కుమార్

బిజినేపల్లి/కందనూలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి శరత్‌కుమార్ శనివారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా, ఆధ్మాతిక భావన విరాజిల్లుతోందని కొనియాడారు. ఆలయంలోని కల్యాణమండపం, హోమశాల, గోశాల, రామానుజచార్యుల పార్కు, అన్నదాన సత్రం వంటి వసతులను పరిశీలించారు. ఆలయ మర్యాదలతో ఆయనను సన్మానించారు. అనంతరం జిల్లా కేంద్రంలో జూనియర్ జస్టిస్ బోర్డు భవన ప్రారంభోత్సవంలో పాల్గొని జిల్లా కోర్టు ప్రాంగణంలో సోలార్ విద్యుత్‌ను ప్రారంభించారు. కోర్టులో మెడికల్ డిస్పెన్సరీ యూనిట్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ అధ్యక్షతన ప్రారంభించారు. ఆయన వెంట కలెక్టర్ బదావత్ సంతోష్, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు హనుమంత్ రెడ్డి, జిల్లా న్యాయాధికారి రాజేష్ బాబు, సబ్ న్యాయాధికారి సబిత, కల్వకుర్తి సబ్ న్యాయాధికారి శ్రీదేవి, ఇన్‌చార్జి న్యాయాధికారి కావ్య, జిల్లా బార్ కౌన్సిల్ చైర్మన్ బండారు రాజశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు, నందడి సురేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, బాస్కరాచారి, శ్రీనివాసులు ఉన్నారు.

ప్రతీ వైద్య విద్యార్థి ఐదు కుటుంబాల దత్తత



కుటుంబ దత్తత కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు

ధరూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ ఆరోగ్య సర్వేలో భాగంగా ప్రతీ వైద్య విద్యార్థికి ఐదు కుటుంబాలను దత్తత కార్యక్రమాన్ని శనివారం ధరూరు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. జిల్లా వైద్య కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ.. కుటుంబంలో ఉన్న ప్రతీ ఒక్కరి సమాచారాన్ని సేకరించి వైద్య విద్యలో భాగంగా వారి యొక్క ప్రాజెక్టు వర్క్‌ను వైద్య కళాశాలలో సమర్పిస్తామన్నారు. వైద్య విద్య (ఐదు సంవత్సరాలు) పూర్తయ్యే వరకు ఆ కుటుంబానికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని వైద్యం అవసరం ఉన్న వారికి వైద్య కళాశాలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. బృందం కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్(హెచ్‌ఈ), మధు (హెచ్‌ఈ) నాయకత్వం వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హీర్యనాయక్, ఆరోగ్య ఆనందయ్య, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పాతాళగంగలో ఏర్పాట్లు శూన్యం



పాతాళగంగలో పాత చీరలు, బ్యానర్ల నీడన సేద తీరుతున్న భక్తులు

దోమలపెంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26న జరిగే మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టులోని పాతాళగంగలో చేపట్టాల్సిన ఏర్పాట్లను అధికారులు పట్టించుకోవడం లేదు. నల్లమల కొండల్లో కొలువుదీరిన శ్రీ భ్రమరాంభ మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారు. శ్రీశైలం బ్రహ్మోత్సవాలలో శివపార్వతుల కల్యాణం వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నల్లమల కొండల మీదుగా పాదయాత్రగా వెళుతున్నారు. శివమాల ధరించిన భక్తులు మల్లన్న సన్నిధిలో మాల విరమణ చేసేందుకు నల్లమల అడవీ మార్గంలో మన్ననూరు నుంచి వటువర్లపల్లికి చేరుకొని ఇక్కడ సేద తీరుతారు. వారం రోజులుగా నల్లమలలో మన్ననూర్, వటువర్లపల్లి, రాసమోనోల్లబావి, దోమలపెంట తదితర ప్రాంతాలలో భక్తులకు అన్నదానం చేస్తారు. శ్రీశైలం మల్లన్న దర్శనం చేసుకునేందుకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన ఎడమ పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. భక్తులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. మహాశివరాత్రి ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం తరపున ఇప్పటి వరకు ఏర్పాట్లు చేయలేదు. 2016లో జరిగిన కృష్ణా పుష్కరాలకు ఎడమ పాతాళగంగ పుష్కర ఘాటుకు రూ. 10 కోట్లకుపైగా ఖర్చు చేసి, 120 తాత్కాలిక మరుగుదొడ్లు, 60 డ్రెస్సింగ్ రూంలు ఏర్పాటు చేశారు. కానీ, ప్రస్తుతం అటువంటి ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ముందుకు రావడంలేదు. శివరాత్రి ఉత్సవాలలో ఆదాయం ఆంధ్ర ప్రాంతానికి చేరుతుందన్న ఉద్దేశంతో తెలంగాణ వైపున ఏర్పాట్లు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

దాహంతో అల్లాడుతున్న భక్తులు

మన్ననూరు నుంచి వటువర్లపల్లికి అటవీ మార్గంలో పాదయాత్రగా వచ్చే భక్తులకు మార్గంమధ్యలో తాగు నీరులేక భక్తులు దాహంతో అల్లాడుతున్నారు. దాతలు ఎవరైనా దారి వెంట నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టాలి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వటువర్లపల్లి, దోమలపెంట, పాతాళగంగ ప్రాంతాలలో అన్నదానం, తాగునీరు తదితర వసతులను శ్రీశైలం దేవస్థానం అధ్వర్యంలో కల్పించేవారు. తెలంగాణ వచ్చిన తరువాత ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా శ్రీశైలం దేవస్థానం అధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

- బుద్దాల ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ దోమలపెంట

ప్రస్తుతం ఏర్పాట్లు చేయడంలేదు

ఎడమ పాతాళగంగ పుష్కరఘాట్‌లో ప్రస్తుతానికి ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాట్లు వారి ఆదేశానుసారం ఏర్పాట్లు చేస్తాము.

- వెంకట ప్రసాద్, అచ్చంపేట డీఎల్‌పీవో

అంబటిపల్లిలో ఉద్రిక్తత

హైడ్రామా నడుమ అక్రమ నిర్మాణం కూల్చివేత
- రెవెన్యూ, పోలీసుల మోహరింపు
- నోటీసులు ఇవ్వకుండా రాత్రివేళ కూల్చివేశారని బాధితుల ఆరోపణ



ప్రహరీ కూల్చివేత వద్ద గుమిగూడిన స్థానికులు

లింగాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని అంబటిపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రహరీ అక్రమ నిర్మాణమని తేల్చిన రెవెన్యూ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య శనివారం తెల్లవారుజామున కూల్చి వేయించారు. గ్రామంలోని ఆసైన్డ్ భూమి సర్వే నెంబరు 732లో 5ఎకరాల 29గుంటల భూమి ఉంది. సింగిల్ విండో చైర్మన్ హనుమంత్‌రెడ్డి ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసి అందులో ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఈ నెల 18న జిల్లా సర్వే అధికారులు సర్వే చేసి కొంత మేర ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని మార్కింగ్ చేశారు. ఈ నెల 20న ప్రహరీని కూల్చివేయడానికి పోలీస్ బలగాలతో రెవెన్యూ అధికారులు వెళ్లగా ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతకు పాల్పడడం తగదని హనుమంత్‌రెడ్డి, ఆయన తండ్రి వెంకట్‌రెడ్డి అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కొంతమంది గ్రామస్థులు ప్రహరీ వద్ద కాపు కాశారు. హైడ్రామ నడుమ ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య ఆర్ఐ సీతారాం పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున అంబటిపల్లి గ్రామానికి వచ్చి ప్రహరీ కూల్చివేత పనులు చేపట్టారు. బాధితులతో కలిసి కొంతమంది అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాత్రి సమయంలో ఎందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను కూల్చివేతలో భాగంగా ప్రహరీని తొలగిస్తున్నట్లు తహసీల్దార్ పాండు నాయక్ తెలిపినా బాధితులు వినిపించుకోలేదు. ఎస్ఐ నాగరాజు సహాయంతో ఎక్స్‌కవేటర్‌లతో ప్రహరీని నేలమట్టం చేయించారు.

నకిలీ సర్టిఫికెట్ల గుట్టురట్టు

● వివరాలను వెల్లడించిన డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం గుట్టురట్టయింది. డీఎస్పీ మొగులయ్య శనివారం గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని వ్యవసాయ శాఖలో కాట్రవత్ నరేష్ డిప్లమా చదువకుండా నకిలీ సర్టిఫికేట్ పొందాడు. ఆ సర్టిఫికెట్ ద్వారా ఏఈవో-గ్రేడ్-11గా ఎంపికై గట్టు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో ఒక ఏడాది, మల్దకల్ మండలంలో ఒక ఏడాది విధులు నిర్వహించారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌పై 2019 మార్చిలో లింగాల మండలం కోమటి కుంట గ్రామానికి బదిలీపై వెళ్లాడు. నిఘావిభాగం ఆధ్వర్యంలో నరేష్‌ను విచారించగా ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివినట్లు ఉందని, అది పక్కా నకిలీదని విచారణలో తేలిందన్నారు. వాస్తవానికి డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ బ్రాంచ్ అక్కడ లేదనే విషయాన్ని వారు వ్యవసాయశాఖ కమిషనర్‌కు సూచించారని తెలిపారు. కాట్రవత్ నరేష్ నకిలీ సర్టిఫికెట్ సమర్పించి 2017, జనవరి 28 నుంచి 2023 డిసెంబరు 31 వరకు ప్రభుత్వం నుంచి జీతం తీసుకున్నారని, 2024, జనవరి 1 న ఉద్యోగానికి రాజీనామా చేసాడని, ఈ విషయంపై గతేడాది మార్చి 15న అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరక్టర్ సీహెచ్. సంగీతలక్ష్మి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని విచారణ చేశామని తెలిపారు. అయితే ఈ విచారణలో మిర్యాలగూడకు చెందిన బాలక్రిష్ణ ప్రిన్సిపాల్ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. బాలక్రిష్ణకు నరేష్‌తో పాటు అచ్చంపేటకు చెందిన జగదీష్, శివశంకర్, రవీందర్, జెరూవుల డాకృతో పాటు మరికొందరు నకిలీ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొందారన్నారు. ఇందులో రవీందర్ గతంలోనే నారాయణపేటలో అరెస్ట్ కాగా మిగిలిన వారు ఇంకా అరెస్ట్ కాలేదన్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల దాకా వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నరేష్ నుంచి రూ. 1.40 లక్షలు తీసుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో నరేష్‌ను జిల్లాకేంద్రంలోని పీజేపీ క్యాంపు వద్ద, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన నాగరాజును రాయవరం గ్రామం, లింగాల మండలంలో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడి ద్వారా ఇంకా ఎంత మందికి నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చారని, ఇందులో ఇంకా ఎంతమంది ఉద్యోగాలు చేస్తున్నారనే విషయాలు కొలిక్కివస్తాయని ప్రధాన నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మల్లెలతీర్థం మల్లన్న పండుగ

దోమలపెంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కుడిచింతల బైలు, సార్లపల్లి గ్రామాలకు చెందిన ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మల్లన్న పండుగ ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు నిర్వహించుకునేందుకు కలెక్టర్ బదావత్ సంతోష్, డీఎఫ్‌వో రోహిత్ గోపిడిలు అనుమతులు ఇచ్చారని ఆలయ కమిటీ అధ్యక్షుడు చిగుర్ల లింగేశ్వర్ తెలిపారు. భక్తుల కోరిక మేరకు మహాశివరాత్రి సీజన్‌లో మల్లెలతీర్థం జలపాతాల సందర్శనకు అటవీ శాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకురావద్దని, అడవిలో మంటలు పెట్టరాదని కోరారు.

చెత్త సేకరణ పన్ను రద్దు చేయాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గతంలో అక్రమంగా తీర్మానం చేసి తీసుకొచ్చిన చెత్త సేకరణ పన్ను రద్దు చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులతో సమావేశమై మాట్లాడారు. పన్నుల బాదుడు మాని, ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. వార్డుల్లో అనవసరపు బోర్లు, వన్ ఇంచ్ పైపులైన్ల అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చర్యలకు రంగం సిద్ధం

» రాజాపూర్ కేజీబీవీలో జరిగిన ఘటనపై మరోసారి విచారణ
» ముగ్గురు అధికారులతో కమిటీ
» ఎస్‌వోతో పాటు ఇద్దరు సీఆర్టీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజాపూర్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థులను కొందరు సీఆర్టీలు దూషించిన ఘటనపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం అయినట్లు తెలిసింది. ఈ మేరకు కేజీబీవీ ఎస్‌వో పావని దేవరకద్రకు బదిలీ కాగా, సీఆర్టీ మంజుల మిడ్జిల్‌కు, మరో సీఆర్టీ సుకీర్తి చిన్నచింతకుంటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజాపూర్ మండల విద్యాధికారి శనివారం విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉంటే, విద్యార్థులను ఓ సీఆర్టీ కులంపేరుతో దూషించిన ఘటనపై మరోమారు విచారణ చేయనున్నట్లు, ఇందుకు సంబంధించి ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. ఈ కమిటీ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి పూర్తి వివరాలు తీసుకోనున్నారు. మొత్తంగా రాజాపూర్ కేజీబీవీలో జరిగిన ఘటన విద్యాశాఖలో కలకలం రేపుతోంది. కేజీబీవీ విద్యార్థులకు మంచి విద్యనందించాల్సిన ఉపాధ్యాయులు వారి మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నది. విద్యార్థులే బాహాటంగా ఓ సీఆర్టీ తనను కులం పేరుతో దూషించారని, తను చెట్లకు నీరు పోస్తే అవి ఎండిపోతాయని అనడం ఈ విషయాన్ని విద్యార్థులు మీడియా ముందు చెప్పడం గమనార్హం. అది కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడం సీఆర్టీలపై తీవ్రమైన ఆరోపణలకు దారి తీస్తోంది.

క్రైం కార్నర్

10 ఎకరాల పప్పుశనగ పంట నాశనం

» పచ్చని పంటపై గడ్డిమందు పిచికారి చేసిన దుండగులు


గడ్డిమందు పిచికారితో ఎండిపోయిన పదెకరాల పప్పుశనగ పంట

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని మారమునగాల-2 గ్రామానికి చెందిన బోయబుచ్చన్న అనే వ్యక్తి ముంపు కింద ఉన్న పది ఎకరాల వ్యవసాయ పొలంలో 70రోజుల క్రితం పప్పుశనగ సాగుచేశాడు. నిండుగా కాపు పట్టిన దశలో పంట ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేశారని రైతు బుచ్చన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా ఎకరాకు రూ.15వేలు ఖర్చు పెట్టానని, చేతికొచ్చిన పంటను నాశనం చేశారని, సుమారు రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు వివరించారు. ఈ విషయంపై ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మానవపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీలోని కర్నూల్ జిల్లా బేతంచెర్ల మండలం గొర్లగుట్ట గ్రామానికి చెందిన బాబు (35) మృతి చెందాడు. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల మేరకు.. బేతంచర్ల నుంచి బండలలోడుతో జాతీయ రహదారి మీదుగా ట్రాక్టర్ గద్వాలకు వెళ్తుండగా మార్గమధ్యలో జల్లాపురం గ్రామ శివారులో బెంగళూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కంటైనర్ వాహనం ముందు వెళ్తున్న టాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీపై పడుకున్న బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, 108లో కర్నూల్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స నిమిత్తం చనిపోయినట్లు వివరించారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

తెలకపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కథనం ప్రకారం... తెలకపల్లికి చెందిన లింగమయ్య(58)శనివారం గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువు వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి శవ పరీక్ష నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి పంపించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు, మహిళ అదృశ్యం

మద్దూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు, ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రెనివట్ల గ్రామానికి చెందిన సిరిగని రాములు(50)కు మతిస్థిమితం లేకపోవండంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు.. 20వ తేదీన తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, సమీప బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లేకపోవండంతో భార్య నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామానికి చెందిన కోట్ల హజ్జుమియా (48)కు గత నాలుగు సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవాడు. అయితే ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటి రాలేదు. సమీప బంధువుల ఇళ్ల వద్ద, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కొడుకు మహిబూబ్‌పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లిగుండు తండాలో వివాహిత..

మద్దూర్ మండలంలోని పిల్లిగుండు తండా కుచెందిన చిట్టి బాయి(28) భర్త రవినాయక్‌తో గొడవ పడి ఈ నెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే తిరిగి ఇంటికిరాకపోవండో భర్త ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. తన బిడ్డ అదృశ్యంపై చిట్టిబాయి తండ్రి వి.లక్ష్మణ్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన ఆమెకు ముగ్గురు సంతానం.

అదనపు కట్నం కోసం వేధింపులు - కేసు నమోదు

వెల్దండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని వేదిస్తున్న భర్త, అత్తమామ, ఆడపడుచులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన జెల్ల పల్లవికి 14 ఏళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్‌తో 20 లక్షల కట్నం ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఉదయ్‌కుమార్ వేరే మహిళతో వివాహేతర సంబందం పెట్టుకుని, అదనపు కట్నం తీసుకురావాలని వేదిస్తున్నాడని, ఈ విషయంపై పల్లవి తన అత్త బాలకిష్టమ్మ, మామ రాములు, ఆడపడుచులకు చెప్పింది. వారుకూడా పట్టించుకోకపోవడంతో పాటు నీ ఇష్టం వస్తే ఉండు, లేకుంటే వెళ్లిపోవాలని వేధిస్తున్నారని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

రెండు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

ధరూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలను అతిక్రమించి ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ కొండా శ్రీహరి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ధరూరు మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్ ద్విచక్ర వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిగా మద్యం తాగిన ఇద్దరిపై రెండు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలకు హాని కలిగే అవకాశం ఉందన్నారు.

కాల గమనంలో..

● వెనుకబడిన కొత్తకోట


కొత్తకోటలో నోరూరిస్తున్న మటన్ సీకులు

» చెప్పుకోవడానికి దివంగత మాజీ ఎమ్మెల్యే అయ్యప్ప సాధించిన ఆఫీసులే..
» నాడు పట్టు చీరలకు ప్రసిద్ధి..
» నేడు మటన్ సీకులకు ఖ్యాతి
» డిగ్రీ, మైనార్టీ జూనియర్ కళాశాలలు లేని పెద్ద మండలం
» పట్టణం పెరుగుతున్నా.. కనబడని ప్రభుత్వ ప్రత్యేకతలు

నేడు కొత్తకోట అంటే మటన్ సీకులు..

పూర్వం కొత్తకోట అంటే చేనేత చీరలకు చాలా ప్రసిద్ధి. ఆ రోజుల్లోనే అగ్గిపెట్టెలో పట్టి చీర నేసి అప్పటి ప్రధాన మంత్రి దివంగత ఇందిరాగాంధీకి బహుమతి ఇవ్వడంతో కొత్తకోటకు దేశ వ్యాప్తంగా ఖ్యాతి వచ్చింది. ఆ ఖ్యాతి నేడు మటన్ సీకుల పేరుతో ఇటు హైదరాబాద్ ఆటు రాయలసీమ ప్రజలకు సుపరిచితంగా మారింది.

తిరోగమనంలో ఉన్న కొత్తకోట దశ మార్చే నాయకుడు పుట్టుకొస్తాడా లేదానేది వేచి చూడాల్సి ఉంది.



ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్

కొత్తకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాల గమనంలో పోటీపడుతున్న కొత్తకోటలో ఉన్న కొత్త ధనం ప్రభుత్వ పరంగా లేదని విమర్శలు లేకపోలేదు. పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్నా అదే స్థాయిలో ప్రభుత్వ ప్రత్యేకలు మాత్రం కనబడటం లేదు. వనపర్తి సంస్థానదీశుల కాలంలో కోట (నేడు ఆ కోట కనుమరుగైంది) నిర్మించడంతో రాజు కుటుంబ సమేతంగా విడిదికి వచ్చే సందర్భంగా కొత్తకోటకు వెళ్లాలని భటులకు ఆదేశాలు వచ్చేవి. అలా కొత్తకోట పేరు ప్రాచుర్యంలోకి వచ్చిందని చరిత్ర చెపుతున్నది.

కనబడని డివిజన్ స్థాయి కార్యాలయాలు ...

మండలాల ఏర్పాటు సందర్భంగా 42 గ్రామాలతో ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ పెద్ద మండలంగా కొత్తకోట ఆవిర్భవించింది. కానీ కోర్టు, ఆర్డీవో, ఎస్‌టీవో, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల డీఈ కార్యాలయాలు ఎందుకు మంజూరు కాలేదనే ప్రశ్నకు ఎవరి వద్ద సమాధానం లేక పోవడం ప్రజల దురదృష్టకరం. ఇరిగేషన్ డీఈ, ఫిషరీష్ ఆఫీసులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాయి. ఇరిగేషన్ పరంగా ఏనుకుంట, శంకర సముద్ర రిజర్వాయర్లతో పాటు బీమా ప్రాజెక్టు ఇక్కడనే ఉన్నాయి. నేటికీ డివిజన్ స్థాయి ఆఫీసును మంజూరు చేయించలేదంటే కొత్తకోటపై మన ఎమ్మెల్యే, ఎంపీలకు ఉన్న ప్రేమ ఏ పాటిదో ఇట్టే అర్థం అవుతుంది.

డిగ్రీ, మైనార్టీ కళాశాలల మంజూరులో నిర్లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలోనే పెద్ద మండలంగా పేరుగాంచిన డిగ్రీ కళాశాల లేదు. అలాగే పట్టణంలో మూడు వేల పైచిలుకు ముస్లిం జనాభా ఉండగా మైనార్టీ జూనియర్ కళాశాల ఎన్నికల హామీగానే ఉండింది. స్వరాష్ట్రం వచ్చాక ప్రభుత్వం డిగ్రీ కళాశాలలు మంజూరు.. ఆ సందర్భంలో కొత్తకోటకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించాలనే తపన నాయకుల్లో లేక పోవడం దగాకోరు తనానికి నిదర్శనమని ప్రజలు చర్చించుకుంటు న్నారు.

డివిజన్ కార్యాలయాలకు అన్ని అర్హతలు ఉన్నాయి..



కొత్తకోటకు డివిజన్ స్థాయి కార్యాలయాలు, నియోజక వర్గం కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయి. పట్టణంలో 18 వేల 653 మంది ఓటర్లు ఉండగా 28వేల 598 మంది ప్రజలు ఉన్నారు. ఇంత పెద్ద పట్టణం ప్రభుత్వ పరంగా నిర్లక్ష్యానికి గురవుతుంది. నాయకులు, రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి డివిజన్ కార్యాలయాల సాధనకు కృషి చేయాలి.

\- బోయెాజ్ మాజీ ఉప సర్పంచ్, కొత్తకోట

మండలం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేల ఎన్నిక ...

కొత్తకోటకు చెందిన అయ్యప్ప వనపర్తి ఎమ్మెల్యే అయిన అనంతరం మండలంలో కానాయపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి ఇతర ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఈ ప్రాంతం నుంచే రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి అభివృద్ధి కాముకుడిగా పేరు తెచ్చుకొని కరువు తాండవిస్తున్న కాలంలో 2 వేల 400 ఆయకట్టు ఉన్న శంకర సముద్రానికి రామన్‌పాడ్ నుంచి ఎత్తిపోతల పథకం మంజూరు చేయించి రైతు కూలీలకు మరింత చేరువయ్యారు. కానీ డివిజన్ స్థాయి కార్యాలయాలు మంజూరు చేయించలేక పోయారని ఆరోపణలు ఉన్నాయి.

మాజీ ఎమ్మెల్యే అయ్యప్ప హయాంలోనే..

మాజీ ఎమ్మెల్యే దివంగత పొగాకు అయ్యప్ప వనపర్తి ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలోనే కొత్తకోటకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని ప్రభుత్వ కార్యాలయాలు మంజూరయ్యాయి. నేడు ఉన్న బస్టాండ్, కోయక్సిల్ (బీఎస్ఎన్ఎల్) ప్రధాన కార్యాలయం, అధికారుల నివాస భవనాలు ఉమ్మడి జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా నిర్మించబడ్డాయి. రోడ్ల భవనాల శాఖ విశ్రాంతి భవనం, ఫిషరీష్ కార్యాలయంతో పాటు కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో కొనసాగే బీడీ దవఖానా అయ్యప్ప మంజూరు చేయించినవే.

ఘనంగా చెన్నకేశవస్వామి

గంప జాతర

» నెత్తిన గంపలతో కోయిలకొండ నుంచి కాలినడకను భక్తులు


చెన్నకేశవస్వామి దేవాలయం ముందు ఉన్న రథానికి గంపలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జడ్చర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలంలోని గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి గంప జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని కోయిలకొండ మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో నెత్తిన గంపలను పెట్టుకుని, కాలినడకను గంగాపురంకు చేరుకుంటారు. దేవాలయంలోని కోనేరులో స్నానం చేసి, మడి వంటలతో ప్రసాదాన్ని వండుతారు. భక్తులంతా ఉపవాసదీక్ష చేపడ్తారు. స్వామి వారికి ప్రసాదాన్ని సమర్పించి, ప్రత్యేక పూజలు చేస్తారు.

గంగాపురం చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం రెండు వారాలు గంప జాతరను చేపడతారు. ప్రతి రెండు సంవత్సరాలు ఒక పర్యాయం గంప జాతరను నిర్వహిస్తారు.

గంపజాతరకు వచ్చే భక్తులకు దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు, సౌకర్యాలను ఆలయ ఈవో దీప్తిరెడ్డి, ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి తదితరులు ఏర్పాటు చేశారు.


గంగాపురంలోని చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంగణంలో గంపలలో తెచ్చిన సామగ్రితో స్వామి వారికి ప్రసాదం వండుతున్న భక్తులు

జాతీయ స్థాయిలో వెండి పతకం సాధించిన విద్యార్థి


వెండి పతకాన్ని సాధించిన టి.రవికుమార్

దామరగిద్ద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ 2025లో నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన టి.రవికుమార్ వెండి పతకాన్ని సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి రమణ తెలిపారు. 1600 మీటర్ల రన్నింగ్‌లో వెండి పతకం, 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టి. రవికుమార్‌ను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్స్ తరఫున అభినందించారు.

శ్రీశైలానికి 357 ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ గద్వాల, నాగర్‌కర్నూల్ నారాయణపేట, వనపర్తి, షాద్‌నగర్ డిపోల నుంచి శివరాత్రి పండుగ పురస్కరించుకొని రోడ్డు రవాణ సంస్థ, మహబూబ్‌నగర్ రీజియన్ నుంచి శ్రీశైలానికి ఈ నెల 23 నుంచి 27 వరకు 357 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన భక్తులు లేదా ప్రయాణికులు గుంపుగా లేదా సామూహికంగా 30 అంతకంటే ఎక్కువగా ఉంటే వారి ప్రాంతం వద్దకే వచ్చి పికప్ చేసుకుంటామని తెలిపారు. శ్రీశైలం, ఆయా బస్ స్టేషన్‌ల ప్రయాణికుల సౌకర్యార్థం చలువ పందిరిలు, తాగునీరు, వలంటీర్ల, సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య

నవాబ్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాళ్ల నొప్పులు భరించలేని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని చౌడూర్‌లో చోటు చేసుకుంది. తండ్రి పకీరయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణయ్య(22) బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో గత కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 20న ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగులమందు తాగి పడుకోగా గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఈనెల 21న తరలించగా రాత్రి 8 గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి పకీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకొని విద్యార్థిని..

జడ్చర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాస కాలనీలో 8వ తరగతి చదువుతున్న మనస్వి(15) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్లలోని శ్రీనివాసనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న దేపల్లి రాజు కుమార్తె మనస్వి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. స్కూల్ ఫీజు చెల్లించకపోవడంతో మూడు రోజులుగా స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుందని దేపల్లిరాజు ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. పోలేపల్లి సెజ్‌లోని ఓ పరిశ్రమలో డ్యూటీకి ఉదయం 5.30 గంటలకు మనస్వి తల్లి వెళ్లిందని, అనంతరం పిల్లలను కళాశాల వద్ద దింపి హమాలీ పనికోసం బాదేపల్లి మార్కెట్‌కు వెళ్లానని ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

» టీపీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్


పతకాలు సాధించిన క్రీడాకారులతో టీపీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని టీపీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 18,19వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించారు. శనివారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినోద్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. కార్తీక్, పౌర్ణమి, కీర్తన బంగారు, శివ, నిఖిల్, హన్సిక, జీవన్ లింగం సిల్వర్ పతకాలు సాధించారు. జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్‌లు ఆనంద్, సునీల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి రిమాండ్


దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్ చేసిన పోలీసులు

దామరగిద్ద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్ చేసినట్లు సీఐ శివ శంకర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. దామరగిద్ద పరిధిలోని ఉలిగుండం గ్రామంలో చంద్రమోల్ల వెంకటప్ప అనే వ్యక్తి మన్యంకొండ జాతర వెళ్లగా తెల్లవారు జామున తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగల గొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లోని బీరువా తాళం పగులగొట్టి తులం బంగారం, లక్ష రూపాయలు పోయాయని దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తి బైక్ నెంబర్ కేఏ32హెచ్ఏ 7310 పల్సర్ బండి అక్కడే వదిలి వెళ్లాడు. దాని ఆధారంగా అడ్రస్ వివరాలు తెలుసుకొని వెళ్లగా, శ్రీను అనే వ్యక్తి తన దగ్గర వేరే ఊరికి వెళ్లొస్తానని నా బైక్ తీసుకొని వెళ్లాడని తెలిపాడు. బండికి సంబంధించిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు నిందితుడు కర్ణాటక రాష్ట్రం సిలర్‌కోటే గ్రామానికి చెందిన బైరంకొండ శ్రీనుగా గుర్తించారు. ఇంతకుముందు కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో రిమాండ్ చేయడం జరిగిందని, మళ్లీ దామరగిద్దలోని ఉలిగుండం గ్రామంలో దొంగతనానికి పాల్పడ్డాడు. అతడు పాత నేరస్తుడిగా గుర్తించి అతని వద్ద నుంచి మ్యాట్నీలు, బంగారు చెవి కమ్మలు మొత్తం 5.9 గ్రాముల బంగారాన్ని 60వేల రూపాయలు రికవరీ చేసి నిందితుడిని శనివారం రిమాండ్ చేసినట్లు సీఐ శివశంకర్ తెలిపారు. కేసులో నిందితుడిని పట్టుకోవడంలో బాగా పనిచేసిన ఎస్ఐ రాజు, క్రైమ్ టీం రాము, ఆంజనేయులు, లింగ మూర్తిలను సీఐ శివశంకర్ అభినందించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రేషన్ కార్డుల ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది

● తహసీల్దార్ చింత రవి



ఊట్కూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఊట్కూర్ తహసీల్దార్ చింత రవి తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

మండలంలో కొత్త రేషన్ కార్డులతో పాటు, మార్పుచేర్పుల కోసం దరఖాస్తులు వచ్చాయా?

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులతో పాటు వివాహమైన అమ్మాయిల పేర్ల తొలగింపు చేయాలని అధికంగా దరఖాస్తులు వచ్చాయి. అలాగే కొత్తగా కొందరిని యాడ్ చేయాలని దరఖాస్తులు సైతం వచ్చాయి.

రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపును ఏవిధంగా నిర్వహిస్తున్నారు?

తొలగించాల్సిన వారి ఆధార్‌కార్డు జిరాక్స్, వివాహం జరిగిన ధ్రువీకరణ పత్రం తీసుకొచ్చి దరఖాస్తు చేసుకుంటే ఆర్ఐ పంచనామా చేసిన తర్వాత తొలగిస్తున్నాం.

ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ ఎంత వరకు వచ్చింది?

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులతో మాట్లాడి భూసేకరణ చేపడుతున్నాం. తిప్రస్‌పల్లి, బాపూర్ గ్రామాల్లో కొంతమేరకు సర్వే చేశాం.

మండలంలో సర్వేయర్ భూముల సర్వే చేయడం లేదని ప్రజలు అంటున్నారు?

భూసర్వే సమస్యలపై ప్రజలు వస్తున్నది వాస్తవం. నారాయణపేట మండలానికి ఒకే సర్వేయర్ ఉండడం వల్ల ఇబ్బంది అవుతున్నది. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సర్వేయర్‌తో మాట్లాడి భూముల సర్వే చేయిస్తాం.

కొత్త ప్రభుత్వ పాలనలో ధరణి సమస్యల పరిష్కారం జరిగిందా?

భూసమస్యల పరిష్కారం కోసం ధరణిలో లేని ఆప్షన్‌లను ప్రభుత్వం తీసుకొస్తున్నది. దానికోసం కొత్త ఆర్‌వోఆర్ చట్టం కూడా రానున్నది. తర్వాత అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట (రూపాయలలో)	కనిష్ట
వేరుశనగ	113.80	6,420	4,110
గుర్రం వేరుశనగలు	10.29	5,677	5,677
నల్ల కందులు	141.61	7,651	6,850
తెల్ల కందులు	39.69	7,759	6,706
చింతపండు	10.75	7,060	5,319

న్యూస్ బాక్స్

రేపటి నుంచి ఆర్మీ కోసం ఉచిత శిక్షణ

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట సరాఫ్ బజార్‌లోని మల్లికార్జున స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత ఆర్మీ కోచింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు కె.మహేష్ తెలిపారు. దామరగిద్ద మండలం అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ పి.రాఘవేందర్‌రెడ్డి, బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ జి.శ్రీనివాస్‌ల చేయూతతో ఆర్మీ ఫిజికల్ ఎగ్జామ్స్ కోసం ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. అభ్యర్థులు శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. ఐదేళ్లుగా ఆర్మీ ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు.

కుంభమేళా నీటితో ఆంజనేయస్వామికి జలాభిషేకం

మరికల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా గంగ, యమున, సరస్వతీ నదుల పవిత్ర నీటితో శనివారం హనుమాన్‌వాడ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి అర్చకుడు సుందరశర్మ వేద మంత్రోచ్ఛరణలతో జలాభిషేకంతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మాట్లాడుతూ కుంభమేళా పవిత్రమైన జలంతో స్వామికి అభిషేకం చేయడం పూర్వజన్మ సుకృతంగా భక్తులు భావించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలి

కృష్ణ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ సాధన కోసం మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన సీపీఎస్ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు నల్లే శివరాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఎంఈవో కార్యాలయ ఆవరణలో ఆయన బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని ఉపాధ్యాయ ఉద్యోగులకు ఇచ్చిన హామీని మరిచిందని గుర్తు చేశారు. సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. కాంప్లెక్స్ హెచ్ఎం గణేష్‌సింగ్, షాహీన్, రామకృష్ణ, ఉపాధ్యాయులు నాగరాజు, గంగాధర్, అశోక్, రవితేజ, రవి, కళ్యాణి తదితరులున్నారు.

నేడు గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

» జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు

» దరఖాస్తు చేసుకున్న 4,130 మంది విద్యార్థులు



పేట సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో రూల్ నెంబర్లు వేస్తున్న అధ్యాపకులు

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదు నుంచి తొమ్మిదవ తరగతిలో ప్రవేశాల కోసం ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్హత ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కోసం 4,130 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు, బ్లాక్, బ్లూ పెన్నులు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం తొమ్మిది గంటలలోగా చేరుకోవాలన్నారు. జిల్లాలో మక్తల్ బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో 300 మంది విద్యార్థులు, నారాయణపేట సింగారం క్రాసింగ్ వద్దనున్న దామరగిద్ద బాలుర గురుకులంలో 400 మంది, మక్తల్‌లో కొనసాగుతున్న ఊట్కూర్ బాలికల గురుకులంలో 450 మంది, పేట యాద్గీర్‌రోడ్ గురుకులంలో 800 మంది, మరికల్ గురుకులంలో 800 మంది, కొండాపూర్ ట్రైబల్ స్కూల్‌లో 840 మంది, పేట కస్తూర్బాలో 340 మంది, ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో 200 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు వివరించారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

» మాణిక్యగిరి స్వామి పండిత్ శ్రీరాములు



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న మాణిక్యగిరి స్వామి పండిత్ శ్రీరాములు

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని ఆచరించి పరిరక్షించాల్సిన అవసరం ఉందని మాణిక్యగిరి స్వామి పండిత్ శ్రీరాములు అన్నారు. శనివారం రాత్రి స్థానిక పళ్ల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం సందర్భంగా ఆయన ప్రసంగించారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవశ్యకత మన అందరిపై ఉందన్నారు. హనుమాన్ చాలీసా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నగర సంచాలక్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు క్యాతన్ రఘునాథ్, శ్రీపాద్ కులకర్ణి, మేదరి నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, బండి శివరామ్‌రెడ్డి, పాండు, దిలీప్, ధరణీధర్ దీక్షిత్, రఘు, శ్రీను, మెలిగిరి కాంబ్లే, ప్రవీణ్, రాము, నర్సింలు, సౌభాగ్య, బజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులతో పాటు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామూహిక హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన

కోస్గి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, చట్టాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నారాయణపేట జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం గుండుమాల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లల్ని కొనడం, అమ్మడం నేరమని అందుకు చట్టపరమైన శిక్షలు అనుభవించాల్సి వస్తుందన్నారు. బాలల హక్కుల రక్షణలో భాగంగా 18 సంవత్సరాల లోపు పిల్లలకు సంరక్షణ చట్టాల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో శేఖర్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కరిష్మా, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నర్సిములు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివస్వాములకు పండ్లు పంపిణీ

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి పాదయాత్రగా తరలివెళ్తున్న శివస్వాములకు పేట శివలింగేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్షుడు గందె రవికాంత్ ఆధ్వర్యంలో శనివారం పండ్లు పంపిణీ చేశారు. 17 ఏళ్లుగా ప్రతీ సంవత్సరం శివరాత్రి సందర్భంగా కాలినడన వెళ్లే శివస్వాములకు పండ్లు పంపిణీ చేస్తు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రవి, మధుసూదన్‌రెడ్డి, రవి, కిరణ్, శశిధర్, కృపాకర్‌రెడ్డి తదితరులున్నారు.

శ్రీశైలం క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నామని డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. ఈనెల 23న ఒక బస్సు 24, 25 తేదీల్లో మూడు, 26న 15 బస్సులు నడుపుతామని ఆమె పేర్కొన్నారు.

మైసమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభం

మరికల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 24న మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మొదటి రోజు వేదపండితులు విశేష పూజలు చేసి, రాత్రికి విగ్రహాలను జలదివాసం చేశారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ సభ్యులు మాట్లాడుతూ మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మూడురోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. 24 ప్రతిష్ఠాపన రోజు గ్రామ ప్రజలందరు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రామస్వామి, నామాల వెంకటయ్య, బాలకృష్ణ తదితరులున్నారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు

ధన్వాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను, ప్రత్యేక కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, అనిత, ఆశ వర్కర్లు అంజిలమణి, మాసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డి పేరు పెట్టడంపై హర్షం

ధన్వాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలకు దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టడంపై ధన్వాడ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు టైలర్ శ్రీనివాస్‌గౌడ్, కాపర్తి రాములుశెట్టి, చిట్టెం శ్రీనివాస్‌రెడ్డి, కంధూర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నర్సిరెడ్డి ఎంతో కృషి చేశారని వారు గుర్తు చేశారు.

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



దామరగిద్ద జడ్పీహెచ్ఎస్‌లో మాదిరి పాఠ్య బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు లక్ష్మి



మక్తల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అనిల్‌గౌడ్

దామరగిద్ద/మక్తల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉన్న ప్రతీ విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, అర్థమెటిక్ రావాలని ఎంఈవో కృష్ణారెడ్డి సూచించారు. దామరగిద్ద జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం దామరగిద్ద ప్రాథమిక పాఠశాల స్థాయి సమావేశాన్ని జీహెచ్ఎం అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి మొదటి రోజు మండలంలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 50 శాతం మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎంఈవో మాట్లాడారు. అలాగే, మండలంలోని ప్రతీ పాఠశాలల వారీగా సమీక్ష చేశారు. చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు లక్ష్మి మాదిరి పాఠ్య బోధన చేశారు. సమావేశంలో జీహెచ్ఎం అన్నపూర్ణ, సత్యనారాయణ, చంద్రకాంత్, బాలాజీ, బాలమురళి, అలోకిత్, కోఆర్డినేటర్ ఎలిజబెత్, సీఆర్పీలు మహిపాల్, రాములు తదితరులున్నారు.

అదేవిధంగా, మక్తల్ పట్టణంలోని ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈవో అనిల్‌గౌడ్ అధ్యక్షతన కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశాలతో ఉపాధ్యాయులకు కొత్తకొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ప్రతీ పాఠశాలలో అపార్ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు గ్రామస్థుల సహకారం తీసుకొని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షలు దగ్గరలో ఉన్నందున విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. సమావేశంలో జక్లేర్, కర్ని కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకటయ్యగౌడ్, చంద్రకళ తదితరులున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా

» పోలీసుల సమ్మతితో రాత్రిపూట సాగుతున్న దందా

» ప్రభుత్వం హెచ్చరిస్తున్నా పట్టింపు కరువు



గుండుమాల్ శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్ (ఫైల్)

కోస్గి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పోలీసుల సమ్మతితో రాత్రిపూట మండలంలోని కడంపల్లి, బిజ్జారం, చెన్నారం, గుండుమాల్ మండలంలోని బోగారం, అమ్లికుంట, గుండుమాల్ వాగుల నుంచి ఇసుక రవాణా సాగుతోంది. రాత్రిపూట పోలీసులకు ఒక్కో ట్రాక్టర్ యజమాని రూ.3 వేలు ఇచ్చి వాహనం నడుపుకుంటున్నామని ఇసుక మాఫియాదారులు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రభుత్వం ఓవైపు ఇసుక మాఫియాను కట్టడి చేయాలని పేర్కొంటూ, తమ అనుమతితోనే ఇసుక సరఫరా చేయాలని, ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టకూడదని పదేపదే చెబుతున్నా ఇక్కడ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోస్గి మండలంలో ఇసుక మాఫియాను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా గత రెండు రోజులుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి ఓ టిప్పర్, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. దీనికితోడు తాజాగా శనివారం ఉదయం ముశ్రీఫా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో ఓ కానిస్టేబుల్ అక్కడికి చేరుకొని ఇసుక మాఫియాతో మాట్లాడి ఒప్పందం చేసుకొని ట్రాక్టర్లను వదిలి వచ్చారు. దీంతో పట్టపగలు ఇసుక నడిపినా ఎవరేమీ చేయలేరన్న చర్చ మండలంలో చక్కర్లు కొడుతోంది.

క్రీడలతో శారీరకదారుఢ్యం

» మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు



టాస్ ఎగురవేస్తున్న కమిషనర్

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరకదారుఢ్యానికి దోహదపడతాయని మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక మినీ స్టేడియంలో కర్ణ ఫ్రెండ్స్ లోకల్ బాయ్స్ అధ్వర్యంలో ఫ్రెండ్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలను కమిషనర్ ప్రారంభించి, మాట్లాడారు. యువత మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గొనాలన్నారు. అఖిల భారత అయ్యప్ప ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య మాట్లాడుతూ టోర్నీలో ఏడు జట్లు తలపడనున్నాయని, ఏడురోజుల పాటు క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌తో పాటు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన

» నియమ నిబంధనలు పాటించాలని అధికారుల సూచన



గోకుల్‌నగర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకుల్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు శనివారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. హౌసింగ్ పీడీ శంకర్, ఎంపీడీవో కృష్ణారావు మాట్లాడుతూ గ్రామానికి 20 ఇళ్లు మంజూరు కాగా అందులో 16 మంది అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో విధివిధానాల గురించి అధికారులు లబ్ధిదారులకు వివరించారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలను నాలుగు విడుతలుగా ప్రభుత్వం అందజేస్తుందని, అలాగే ఇసుకను ట్రాక్టర్ పది ట్రిప్పుల వరకు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. గ్రామ కార్యదర్శి హరికృష్ణ, మాజీ సర్పంచ్ మిరాన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పూసల్‌పాడ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల



పూసల్‌పాడ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల చేస్తున్న డీఈవో తదితరులు

నారాయణపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల రెండో తేదీన జరిగిన పూసల్‌పాడ్ టాలెంట్ టెస్టు ఫలితాలను జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు శనివారం డీఈవో కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల్లో టాప్ పది మంది విద్యార్థుల పేర్లు ప్రకటించి డీఈవో మాట్లాడారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంగానో ఉపయోగపడతాయన్నారు. నిర్వాహకుడు షేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 120 పాఠశాలల నుంచి 3750 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో విద్యాసాగర్, నాగార్జునరెడ్డి, శ్రీనివాస్, ఎంఈవో బాలాజీ, నరసింహారెడ్డి, భానుప్రకాష్, బాల్‌రాజ్, నరసింహ, కిశోర్, సీతారాములు, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు అనిత

కృష్ణ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కున్సి గ్రామంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు నరసింహులు, అనితలు బాల్య వివాహ చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతీ బాలిక చదువుకొని తన కాళ్ల మీద తాను నిలబడడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం వారు పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అరుణ, ప్రధానోపాధ్యాయురాలు సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పడమటి అంజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



ఆలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ, భజన మండలి నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పడమటి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని దేవాలయ భజన మండలి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆలయ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ ఆవరణలో ఉన్న క్రయ, విక్రయాల కేంద్రాలను ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆలయానికి ముఖద్వారం ఏర్పాటు చేయాలని అన్యమతస్తులు పూజా సామగ్రి విక్రయించకుండా చూడాలన్నారు. పౌర్ణమి, అమావాస్య, ప్రతీ శనివారం ఎక్కువ సంఖ్యలో భక్తులు రావడంతో సంగంబండ రోడ్‌లో పార్కింగ్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఇక వర్షాకాలంలో మురుగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలన్నారు. వీహెచ్‌పీ నాయకులు కర్ని కృష్ణమూర్తి, మహేష్ సాగర్, మంజునాథ్, భీమేష్, వంశీ, నాని, వినయ్, ప్రదీప్, నర్సింహా ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో విద్యార్థులకు అవగాహన కల్పించుటలో భాగంగా జిల్లా స్థాయిలో పదవ తరగతి విద్యార్థులు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నషా ముక్త్ భారత్ అభియాన్ వలంటీర్లు లక్ష్మీకాంత్, కుమారి సంధ్య అన్నారు. వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ శాఖ ఎఫ్ఆర్‌వో సాయి, హెచ్ఎం సత్యనారాయణసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికునికి సన్మానం

మద్దూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న దంగాన్‌పూర్ ఇక్బాల్‌ను పట్టణంలోని చికిని శంకర్ కుటుంబం శనివారం ఘనంగా సన్మానించింది. చికిని శంకర్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో శంకర్, అంజయ్యలు ఇక్బాల్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్రా యాత్ర చేసేవారు ఎంతో అదృష్ట వంతులన్నారు. అక్కడికి వెళ్లి అందరి కోసం ప్రార్థన చేయాలని కోరారు. ఇరు మతాల ప్రజలు ఒకరి భావాలను మరొకరు గౌరవించుకోవడం సంతోషకర విషయమని, ఇలాంటి ఆదర్శవంతమైన సోదరభావం ఎల్లకాలం ఉండాలని ముస్లిం మత పెద్దలు ఆకాంక్షించారు. జామేమస్జిద్, అల్‌జుబేది మస్జిద్ కమిటీ సభ్యులు అబ్దుల్ ఖయ్యుం, సయ్యద్‌మూస, హబీబ్, చాంద్‌పాష, పీరహ్మద్, అబ్దుల్‌ఖాలిద్, అన్వర్, ఖయ్యూమ్, హుసేన్, మహిమూద్‌తో పాటు షబ్బీర్, షఫీ, కమ్రుద్దీన్ తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.